## క్లుప్తంగా

### ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా షేక్ మహమూద్



సైదాబాద్: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీకి చెందిన షేక్ మహమూద్ ఎన్నికయ్యారు. ఈనెల 29, 30న రెండు రోజుల పాటు హిమాయత్‌నగర్‌లో నిర్వహించిన 2వ తెలంగాణ రాష్ట్ర ఏఐవైఎఫ్ మహాసభల్లో హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్న ఆయనను రాష్ట్ర కమిటీ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నుకుంది. ఈ సందర్భంగా మంగళవారం ఆయన సింగరేణి కాలనీలో మాట్లాడుతూ, యువత ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పోరాడతామని అన్నారు.

### జీఎస్ఐ ఉద్యోగికి డాక్టరేట్



మల్లేష్ గంజి

మన్సూరాబాద్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (జీఎస్ఐటీఐ)లో సీనియర్ జియాలజిస్ట్, ఫ్యాకల్టీగా విధులు నిర్వహిస్తున్న మల్లేష్ గంజి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఓయూలో జరిగిన స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

### జన్మదిన వేడుక.. అన్నదానం



హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని పోదర్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి అగస్త్య మంగళవారం తన ఏడవ జన్మదినంను పురస్కరించుకుని ఉపాధ్యాయులతో కలిసి పాఠశాలలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ ప్రతిక్ష, హెచ్‌ఎం ప్రసన్న, టీచర్ అమృత, స్వప్న, తల్లిదండ్రులు డాక్టర్. నగేష్ గౌడ్, డాక్టర్ ప్రియా గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరంఅమ్మనాన్న అనాథాశ్రమంలో అన్నదానం చేశారు.

### ఎల్‌బీనగర్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా గిరికుమార్



చంపాపేట: ఎల్‌బీనగర్ నియోజకవర్గ బ్లాక్–ఏ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా చంపాపేటకు చెందిన మకరాల గిరికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం చంపాపేటలో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ నియామక పత్రం అందజేశారు.

### ఘనంగా కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ దినోత్సవం

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్‌లోని అనిబీసెంట్ ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో మంగళవారం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ దినోత్సవాన్ని ఘనం నిర్వహించారు. ప్రొఫెసర్లు ముత్యంరెడ్డి, సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కాలేజీ సెక్రటరీ డాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ దయాకర్‌రెడ్డిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించారు. ప్రదర్శనలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ సురేఖరెడ్డి, సుమతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

### బ్రెస్ట్ కేన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

దిల్‌సుఖ్‌నగర్: ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ శాతం మహిళలు రొమ్ము కేన్సర్‌తో ప్రాణాలు కోల్పోతున్నారని, ఈ వ్యాధిని ఆదిలోనే గుర్తించి కొన్ని మెళకువలు పాటిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని కేన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎ.కిరణ్ కుమార్ అన్నారు. ఆర్‌కే పురం డివిజన్ చిత్రా లేఅవుట్ కాలనీలో మంగళవారం నిర్వహించిన బ్రెస్ట్ కేన్సర్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆధునిక జీవన ప్రమాణాలు, ఆహారపు అలవాట్లు ఈ వ్యాధి ఉధృతికి కారణమవుతున్నాయన్నారు. సమతుల్య ఆహారం, రోజూ వ్యాయామం చేస్తే రొమ్ము కేన్సర్ రాకుండా చూసుకోవచ్చు తెలిపారు. కాలనీ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

### నాణ్యతతో పనులు చేపట్టాలి

నాగోలు: కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యత పాటిస్తూ సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులకు సూచించారు. కొత్తపేట గ్రామంలో కొత్తగా వేస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ మాతృ నాయక్ , వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, నాయకులు రాజేష్,రామకృష్ణ, కొత్త తిరుమల, మహేష్, సత్య నారాయణ, వెంకట్ రెడ్డి, వెంకటేష్, శంకర్ పాల్గొన్నారు.

# ప్రజా సేవకులకే ప్రాధాన్యం



వనస్థలిపురం శారదానగర్‌లో చర్చా గోష్టిలో పాల్గొన్న సీనియర్ సిటిజెన్స్

◆ వనస్థలిపురం శారదానగర్‌లో జీహెచ్‌ఎంసీ ఆసరా డే కేర్ సెంటర్‌లో 'సాక్షి' ఆధ్వర్యంలో 'ప్రజా ఎజెండా' పేరుతో సీనియర్ సిటిజన్స్‌తో ఏర్పాటు చేసిన చర్చా గోష్టి అర్థవంతంగా జరిగింది. సీనియర్ సిటిజన్స్ అభిప్రాయాలు ఇవీ...

- ప్రలోభాలకు లొంగ కూడదు
- మేధావుల మౌనం దేశానికి మంచిది కాదు
- సరైన అభ్యర్థులనే ఎన్నుకోవాలి
- 'సాక్షి' 'ప్రజా ఎజెండా' లో సీనియర్ సిటిజెన్స్

వనస్థలిపురం: ఒకప్పటి రాజకీయాలు వేరు... ఇప్పటి రాజకీయాలు వేరు. నేడు డబ్బులతో ఓట్లు కొని పదవులు పొందుతున్నారు. అభ్యర్థులు ఎలక్షన్లకు ముందు ఒకలా.. ఆ తర్వాత మరోలా ఉంటున్నారు. గెలిచిన తర్వాత సేవను మరచి తమ స్వలాభం చూసుకుంటున్నారు. ఒక పార్టీ నుంచి గెలిచిన వ్యక్తి అదే పార్టీలో ఉంటాడన్న నమ్మకం లేదు. రాజకీయ పార్టీలు ఎన్ని వచ్చినా సామాన్య, మధ్య తరగతి ప్రజల బతుకుల్లో వృద్ధి లేదు, అదానీలు, అంబానీలే అభివృద్ధి చెందుతున్నారు. సేవాగుణం ఉన్నా డబ్బులు లేని వ్యక్తి పోటీచేసే పరిస్థితులు లేవు. ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా, నిత్యం ప్రజల్లో ఉంటూ నిస్వార్థంగా సేవ చేసే వ్యక్తులనే చట్టసభలకు ఎన్నుకోవాలని పలువురు సీనియర్ సిటిజెన్స్ పేర్కొన్నారు. గ్రామాలలో ఉన్నంత ఓటింగ్ శాతం సిటీలలో ఉండటం లేదని, మేధావులు, చదువుకున్న వారి మౌనం దేశానికి మంచిది కాదని, సరైన అభ్యర్థులను ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని అన్నారు.

### సరైన అభ్యర్థులను చట్టసభలకు పంపిద్దాం...



ప్రజాస్వామ్య దేశంలో ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికల్లో సరైన, మేధాసంపత్తి గల వారిని చట్టసభలకు ఎన్నుకోవాలి. అదే మన దేశ ప్రగతికి పునాది. ప్రతి పౌరుడు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా మంచి వ్యక్తులను గెలిపించుకోవాలి. సమాజంలో సీనియర్ సిటిజెన్స్‌పై చిన్నచూపు ఉంది. సీనియర్ సిటిజెన్స్ అనుభవాలు, సేవలు సమాజానికి అవసరం.

కొప్పోలు జగన్నాథరావు, రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్

### సేవ చేసే వారినే గెలిపిద్దాం...



రాజకీయాలు రోజు రోజుకూ దిగజారి పోతున్నాయి. రాజకీయ నాయకులు గెలవక ముందు ఒకలా, గెలిచిన తర్వాత మరొకలా ఉంటున్నారు. నోట్లకు ఓట్లు అమ్ముకోకుండా సేవ చేసే వారినే ఎన్నుకోవాలి. శారదా నగర్ డే కేర్ సెంటర్‌లో మెయింటినెన్స్ కోసం నెల నెలా ఇచ్చే రూ. 6 వేలు గత కొన్ని నెలలుగా రావడం లేదు.

ఎస్. జ్ఞానేశ్వర్, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగి

### సీనియర్ సిటిజెన్స్‌కు బస్సులు, రైళ్లలో రాయితీ తొలగించారు



సీనియర్ సిటిజెన్స్‌కు బస్సులు, రైళ్లలో ఉన్న రాయితీని తొలగించారు. ఆరోగ్య సమస్యలపై హెల్ప్ లైన్ నెంబర్ ఇస్తున్నారు కానీ అవి ఎంతవరకు పనిచేస్తాయో తెలియదు. బ్యాంకుల్లో దాచుకున్న సొమ్ముకు భద్రత లేకుండా పోతోంది. ఎంపీ, ఎమ్మెల్యేలుగా గెలిచినా వారు కొన్ని ప్రాంతాలకు రావడం లేదు. ఇక్కడ ఎంపీగా గెలిచిన వ్యక్తి మా ప్రాంతానికి ఒక్కసారి కూడా రాలేదు.

డా.సిరిపురపు అప్పారావు

### మంచి వ్యక్తులు ఎన్నికల్లో పోటీచేసే పరిస్థితులు లేవు



రాజకీయ పార్టీలు ఎన్ని వచ్చినా సామాన్యులకు ఒరిగేది ఏమి లేదు. మేధావులు నిశ్శబ్దంగా ఉంటూ ఎన్నికలపై ఆసక్తి చూపడం లేదు. మంచి వ్యక్తులు డబ్బులు లేక ఎన్నికల్లో పోటీచేసే పరిస్థితులు లేవు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినా ట్రెజరీ ద్వారా జీతాలు ఇవ్వడం లేదు. గత నాలుగేళ్లుగా డీఏ ఎరియర్స్ ఇవ్వడం లేదు. 2017 వేతన సవరణ ఇంత వరకు జరగలేదు.

ఎస్.బాబు, రిటైర్డ్ అసిస్టెంట్ మేనేజర్, ఆర్టీసీ

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు



బండ్లగూడలో ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు

నాగోలు: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. నాగోలు డివిజన్‌లోని శుభం కన్వెన్షన్, జైపురికాలనీ, సర్వే నెంబర్ 58, ఫతుల్లాగూడ, బండ్లగూడ, ఆనంద్‌నగర్ చౌరస్తా, జీఎస్ఐ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌బీనగర్ అడిషనల్ డీసీపీ కోటేశ్వరావు మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు చోటు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక భద్రత కల్పిస్తామన్నారు. అందరూ ముందుకు వచ్చి ప్రశాంత వాతారణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఏసీపీ జానకిరెడ్డి, నాగోలు సీఐ వెంకటేశ్వర్లు, ఎల్‌బీనగర్ సీఐ అంజిరెడ్డి, చైతన్యపురి సీఐ నాగార్జున, సరూర్‌నగర్ సీఐ శ్రీనివాస్, డీఎస్, సీఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## పార్కు స్థలంలో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

హస్తినాపురం: ఇంద్రప్రస్థ కాలనీ రోడ్డు నంబర్ 6లో 46 గజాల పార్కు స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదు చేసినా ఎల్‌బీనగర్ టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు వాపోయారు. అధికారులు నిర్మాణదారుల నుంచి ముడుపులు తీసుకుని వారికే సహకరిస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం వారు ఆ నిర్మాణం ముందు నిరసన వ్యక్తం చేశారు. పార్కు స్థలాన్ని కబ్జాచేసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేసినా ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడంలేదన్నారు. వెంటనే అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేయాలని, లేకపోతే జీహెచ్‌ఎంసీ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మోహన్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నాగార్జున, అంజన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు కాయితి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మహిళలను వేధిస్తే కఠిన చర్యలు




మాట్లాడుతున్న ఉమెన్స్‌సేఫ్టీ వింగ్ డీసీపీ ఉషా విశ్వనాథ్

నాగోలు: మహిళలను వేధిస్తే చర్యలు తప్పవని రాచకొండ ఉమెన్స్ సేఫ్టీ వింగ్ డీసీపీ ఉషా విశ్వనాథ్ అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత 15 రోజుల్లో మహిళలను, యువతులను వేధింపులకు గురి చేసిన 66 మంది ఆకతాయులను రాచకొండ షీ టీమ్స్ పట్టుకొని అరెస్టు చేశాయి. వీరిలో 34 మేజర్స్, 32 మైనర్స్ ఉన్నారు. మంగళవారం ఎల్‌బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో భూమిక ఉమెన్స్ కలెక్టివ్ ఎన్‌జీఓ సంస్థ ఆధ్వర్యంలో పట్టుబడిన వారికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ ఉషా విశ్వనాథ్ మాట్లాడుతూ, మహిళలను వేధించే పోకిరీలను రాచకొండ షీ టీమ్స్ పోలీసులు వదిలిపెట్టే ప్రసక్తి లేదని, మహిళలు, యువతులు నిర్భయంగా 8712662111కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో షీ టీమ్స్ ఏసీపీ వెంకటేశం, సీఐ పరశురాం, అడ్మిన్ ఎస్ఐ రాజు, షీ టీమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

### సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్‌కు ఘన నివాళి



మన్సూరాబాద్: ఉక్కు మనిషి సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ జయంతి వేడుకలను మన్సూరాబాద్‌లో మంగళవారం నిర్వహించారు. కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తన కార్యాలయంలో పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్, నాయకులు కడారి యాదగిరి యాదవ్, పాతూరి శ్రీధర్‌గౌడ్, హరీష్‌రెడ్డి, ముత్యంరెడ్డి, ఎంజాల సురేష్, వెంకట్‌రెడ్డి, నవీన్, సిద్దు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరా గాంధీ జీవితం స్ఫూర్తిదాయకం

నాగోలు: దేశ మాజీ ప్రధాని, భారత రత్న ఇందిరాగాంధీ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఇందిరా గాంధీ వర్ధంతిని మంగళవారం కొత్తపేటలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు లింగాల కిషోర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మధుయాష్కీ.. ఇందిరాగాంధీ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వజీర్ ప్రకాష్‌గౌడ్, బద్దుల వెంకటేష్‌యాదవ్, వేణుయాదవ్, శశిధర్‌రెడ్డి, కవిత, భాను, రాణి, స్వప్న, భాగ్య, సామలేటి సాయిరాం, షేక్‌అబ్దుల్‌కరీం, లింగాల బాషాగౌడ్, వహీద్, ప్రవీణ్ పాల్గొన్నారు.

### ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

లింగోజిగూడ: ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలీకేరి సూచించారు. శాసన సభ ఎన్నికల సందర్భంగా ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి మంగళవారం సరూర్‌నగర్ జూనియర్ కళాశాలలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్నికల అధికారి భారతి హోలీకేరి మాట్లాడుతూ, ప్రతి పోలింగ్ బూత్ వద్ద కట్టుదిట్టమైన ఏర్పాటు చేయాలని, ఎక్కడ కూడా సిబ్బంది నిర్లక్ష్యంగా వహించవద్దని అన్నారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఎన్నికల అధికారి, జోనల్ కమిషనర్ పంకజ, ఈఆర్ఓ రవీంద్రకుమార్, ఏఆర్ఓ అరుణాకుమారి పాల్గొన్నారు.

### క్రీడలతో మానసిక ఉల్లాసం



నాగోలు: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదం చేస్తాయని టూరిజం అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. నాగోలులో ఆర్ 3 మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మెన్ డబుల్స్, ఉమెన్ డబుల్స్ విజేతలకు బహుమతులు ప్రదానోత్సవ కార్యక్రమానికి ఉప్పల శ్రీనివాస్ గుప్తా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

### 'వికలాంగులను చిన్నచూపు చూసిన పార్టీలకు బుద్ధి చెప్తాం'

చాదర్‌ఘాట్: వికలాంగులను చిన్నచూపు చూసిన పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్తామని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం హెలెన్ కెల్లర్ రీజనల్ అసోషియేషన్ ఫర్ ది డిజేబుల్ అధ్యక్షుడు పీవీ రావు అధ్యక్షతన మలక్‌పేట వికలాంగుల పార్కులో ఇంటర్నేషనల్ వైట్ కాన్ డే నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పలువురు వికలాంగులకు చేతికర్రలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జనాభా దామాషా ప్రకారం రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు ప్రవీణ్‌కుమార్, రామచందర్, బండి శ్రీనివాస్, బేగం, అశోక్ పాల్గొన్నారు.

### అందెశ్రీ కూతురు వెన్నెలకు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: అందెశ్రీ కూతురు వెన్నెల ఫిజిక్స్ విభాగంలో పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. మంగళవారం ఓయూలో జరిగిన 83వ స్నాతకోత్సవంలో పద్మశ్రీ శంతను నారాయణ్, వీసీ రవిందర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. డాక్టరేట్ అందుకున్న వెన్నెలను కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు.

## 'కారు'కు ఓటేసి అభివృద్ధికి సహకరించండి

### ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సమావేశంలో సుధీర్‌రెడ్డికి గొర్రెపిల్లను బహూకరిస్తున్న కురుమ సంఘం నాయకులు

నాగోలు: రాష్ట్రంలో గొర్రెల పంపిణీ పథకం తరహాలో దేశంలో ఏ రాష్ట్రంలో పథకాలు ప్రవేశ పెట్టలేదని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నాగోలు డివిజన్ జైపురికాలనీలో యెగ్గె మల్లేశం ఫంక్షన్ హాల్‌లో ఎల్‌బీనగర్ నియోజకవర్గ కురుమ సంఘం ఆత్మీయ సమావేశంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, మాంసం ఉత్పత్తులకు భారీ డిమాండ్ ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇతర రాష్ట్రాల నుంచి ఇప్పటి వరకు మాంసాన్ని దిగుమతి చేసుకున్న తెలంగాణ ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతోందన్నారు. కురుమ సంఘ భవనం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ కోకాపేటలో స్థలం ఇచ్చారన్నారు. గొర్రెల పంపిణీ పథకంతో కురుమలు ఆర్థిక పరిపుష్టి చెందుతున్నారన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి నియోజకవర్గ అభివృద్ధికి సహా య సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు యెగ్గే మల్లేశం, దయానంద్ గుప్తా, వస్పరి శంకర్, సిద్ధల శంకర్, వస్పరి మల్లేష్, మైల శ్రీనివాస్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

#### అభివృద్ధిలో ముందంజలో ఉంచా...

మన్సూరాబాద్: అభివృద్ధిలో ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని ముందంజలో ఉంచానని బీఆర్‌ఎస్ ఎల్‌బీనగర్ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ పెద్దచెరువు వద్ద వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, సమీప కాలనీలవాసులను ఎమ్మెల్యే మంగళవారం కలిసి ఓటు అభ్యర్థించారు. మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, మహిళా అధ్యక్షురాలు కొసనం ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

#### ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై దాడి హేయమైన చర్య

వనస్థలిపురం: దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కాంగ్రెస్ పార్టీకి చెందని గూండా కత్తితో దాడి చేయడం హేయమైన చర్య అని, ఇది కాంగ్రెస్ పార్టీ సంస్కృతికి నిదర్శనమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వనస్థలిపురం డివిజన్ ఆర్టీసీ కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

## ఎల్‌బీనగర్‌లో బీజేపీ జెండా ఎగురవేయాలి



సమావేశంలో పాల్గొన్న మునిరత్నం నాయుడు, సామ రంగారెడ్డి తదితరులు

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేయాలని కర్ణాటక మాజీ మంత్రి, బెంగళూరు సిటీ ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు అన్నారు. చైతన్యపురి డివిజన్ బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేసి బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా: ఎమ్మెల్యే బలాల



ఎమ్మెల్యే బలాలను సన్మానిస్తున్న జయస్వామి

మలక్‌పేట: సమస్యలు పరిష్కరించడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. సామాజిక వేత్త, దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా టెంపుల్ మాజీ చైర్మన్ డాక్టర్ జయస్వామి ఆధ్వర్యంలో మంగళవారం అక్బర్‌బాగ్ టీవీ టవర్ వద్ద నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా బలాల మాట్లాడుతూ... ప్రజల ఆశీస్సులతో మూడు పర్యాయాలుగా మలక్‌పేటను అభివృద్ధి పథంలో నడిపించానన్నారు. సమస్యలను గుర్తించి మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తానన్నారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడంలో ఎక్కడా రాజీ పడలేదన్నారు. జయస్వామి మాట్లాడుతూ.. ప్రజల కష్టాలను పట్టించుకునే నాయకులను ప్రజలు తప్పక ఆదరిస్తారన్నారు. ఎమ్మెల్యే బలాలను, ఎంఐఎం నేత షఫీయుద్దీలను ఘనంగా సన్మానించారు. నాయకులు షఫీయుద్దీన్, చౌకి రవికుమార్, ఖాన్, వాసు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం

### కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్



రాక్‌టౌన్ కాలనీవాసులతో మాట్లాడుతున్న మధుయాష్కీ గౌడ్

నాగోలు: కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ అభ్యర్థి మధుయాష్కీగౌడ్ అన్నారు. మంగళవారం కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీ అధ్యక్షుడు అనంతుల సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలిపించి సోనియాగాంధీ బహుమతి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మేడ్చల్ జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ రెడ్డి, కొత్తపేట మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్, లింగాల కిషోర్‌గౌడ్, సుబ్రహ్మణం, వెంకట్‌రెడ్డి, రాములుగౌడ్, గౌతమ్ పాల్గొన్నారు.

#### మోసపూరిత హామీలతో మభ్యపెట్టను ...

మన్సూరాబాద్: కాలనీవాసులు ఏమీ అవసరమో చెప్పండి..అవే మేనిఫెస్టోలో పెడతా... మోసపూరిత హామీలతో మభ్యపెట్టనని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. నాగోలు డివిజన్ పరిధి రాక్‌టౌన్‌కాలనీలో ఆయన మార్నింగ్ వాక్ చేపట్టి ప్రజలను కలుసుకున్నారు. "మీ కుటుంబ సభ్యుడిగా వస్తున్నా..అవకాశం ఇవ్వండి.. పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటా'' అని భావోద్వేగంతో తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్ దర్పెల్లి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు లింగాల కిషోర్, కాలనీవాసులు జైపాల్‌రెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం: మురుకుంట్ల



ఆర్‌కేపురంలో సబితారెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: బీఆర్‌ఎస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ అన్నారు. మంగళవారం ఆర్‌కేపురం డివిజన్ అల్కాపురి, ఆర్‌కేపురం కాలనీలో బీఆర్‌ఎస్ మహేశ్వరం అభ్యర్థి, మంత్రి సబితా ఇంద్రారెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంత్రి సబితారెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సాజిద్, దుబ్బాక శేఖర్, సునీతారెడ్డి, కొండ్ర శ్రీనివాస్, యాదవరెడ్డి, రామచారి, ఉర్మిలారెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించాలి



పార్టీ అభ్యర్థికి సంఘీభావం తెలుపుతున్న మలక్‌పేట కాంగ్రెస్ నాయకులు

చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకే అనుకూల పరిస్థితులు ఉన్నాయని అభ్యర్థి షేక్ అక్బర్ అన్నారు. మంగళవారం మలక్‌పేటలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ఆరు డివిజన్‌ల అధ్యక్షులు, సీనియర్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్‌కు ప్రజల నుంచి మంచి మద్దతు లభిస్తోందన్నారు. డివిజన్ల పరిధిలో పార్టీ నాయకులు అందరినీ కలిసి పార్టీ ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీల గురించి వివరించాలని అన్నారు. ఈ సందర్భంగా మలక్‌పేట నియోజకవర్గంలోని డివిజన్ల అధ్యక్షులు, సీనియర్ నాయకులు షేక్ అక్బర్‌కు తమ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ల అధ్యక్షులు శ్రీనివాసగౌడ్, చక్రపాణి, షకీల్, మహేష్‌కుమార్, నూర్‌మహ్మద్‌ఖాన్, రాజశేఖర్, మదన్‌బాబు పాల్గొన్నారు.